




# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 101,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,బుధవారం, తేదీ : 12-08-2026


## కరెన్సీపై కేంద్రం కీలక నిర్ణయం- రూ.10, రూ.20 పాలిమర్ నోట్ల ట్రయల్స్ కు గ్రీన్‌సిగ్నల్



- ఫీల్డ్ ట్రయల్స్ కోసం రూ.10, రూ.20 పాలిమర్ నోట్లు
- సక్సెస్ అయితే సాధారణ చలామణిలోకి పాలిమర్ కరెన్సీ

ఢిల్లీ : దేశంలో కరెన్సీ నోట్ల రూపంలో కీలక మార్పునకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఒక్కో నోటు విలువ 100 కోట్ల చొప్పున మొత్తం 200 కోట్ల పాలిమర్ నోట్లను ఫీల్డ్ ట్రయల్స్ కోసం తీసుకురానున్నారు.

### భారత్‌లో అరుణాచల్ విడదీయలేని భాగం

## ఆ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు'

- చైనాపై కీలక వ్యాఖ్యలు చేసిన భారత్- దేశంలో అరుణాచల్ ప్రదేశ్ విడదీయలేని భాగమని వెల్లడి
- పీఓకేలోని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని ప్రకటన
- భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్



ఢిల్లీ : సరిహద్దు రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు పెట్టడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో భారత్ కీలక వ్యాఖ్యలు చేసింది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో వీడదీయలేని అంతర్భాగమని పేర్కొంది. ఈ తిరుగులేని వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేసింది. అలాగే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని పేర్కొంది. పాకిస్థాన్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను పరిశీలిస్తున్నామని వెల్లడించింది. మానవ హక్కుల ఉల్లంఘనలకు పాకిస్థాన్‌ను బాధ్యుడిగా చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. మిగతా..2లో

### ఆగస్టు 15న జెండా పండుగను సగర్వంగా

## నిర్వహించుకుందాం

- భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇవాళ (మంగళవారం) ప్రధాని నరేంద్ర మోదీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ వీడియో పోస్టు చేశారు.
- ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు.



2లో



ఢిల్లీ: భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ (మంగళవారం) ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళు లర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు.

## POB రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించొద్దు



- నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.
- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మాటిచ్చారు.

హైదరాబాద్, ఆగస్టు 11 : నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మాటిచ్చారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు.

### డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

## భారీ పెట్టుబడులే లక్ష్యం

- సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- గతేడాది వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై నివేదిక కోరిన సీఎం
- వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక
- హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష
- రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం



హైదరాబాద్: తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. మిగతా..2లో

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల మిగతా..2లో

## నకిలీ పోలీసులతో ర్యాలీలా? వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు




- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

అమరావతి: నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని మిగతా..2లో

## తిరుమలలో భారీ రద్దీ.. శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు



- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం
- నిన్న స్వామివారిని దర్శించుకున్న 81 వేల మంది భక్తులు
- ఒక్కరోజే రూ.5.36 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం
- క్యూలైన్లలోని భక్తులకు పాలు, అన్నప్రసాదాల పంపిణీ

తిరుపతి : శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో తిరుగిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోగా, వేలాది మంది భక్తులు వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న విపరీతమైన మిగతా..2లో

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట: పాలకొల్లు సభలో జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు నిప్పులు



- ఆక్వారంగానికి రూ. 1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీ జీవోను విడుదల చేసిన అచ్చెన్న
- ఆక్వారంగం చంద్రబాబు మానసపుత్రిక అని వ్యాఖ్య
- జగన్ చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

అమరావతి : రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వెంటిలేటర్‌పై పడేసిన వాళ్లకు, తాడేపల్లి ప్యాలెస్ దాటని మాజీ సీఎం జగన్‌కు ఆక్వా రైతుల కష్టాల గురించి మాట్లాడే హక్కే లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర

## లక్ష్య సాధనకు సహకరించా

- ప్రజల భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్‌నేషన్ బిల్డింగ్ సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.
- ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.



అమరావతి, ఆగస్టు 11: ప్రజల భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్‌నేషన్ బిల్డింగ్ సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ఈరోజు (మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా..2లో

## 158 గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పవన్ ఆదేశం



2లో

- పంచాయతీరాజ్ అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష
- మరో 158 ఆవాసాలకు తొలిసారి రహదారి సౌకర్యం
- ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.422.10 కోట్ల నిధులు

అమరావతి : రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికి సైతం రోడ్డు సౌకర్యం కల్పించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు గ్రామీణ రహదారుల నిర్మాణంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే అడవితల్లి బాట పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నో గిరిజన గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం కల్పించారు. ఇప్పుడు మైదాన ప్రాంతాల్లో మారుమూల పల్లెలు, ఆవాసాలకు, కుగ్రామాలకు రోడ్లు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

బుధవారం12-08-2026

## మొదటి పేజీ తరువాయి

## వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలి

ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. పార్టనర్స్ ఇన్నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అంతా భాగస్వామ్యం కావాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలని సీఎం సూచించారు. గుంతలు పడిన రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తమ ప్రభుత్వం మంచి పని చేస్తే ప్రజలు ఇన్‌వాల్వ్ అవుతారనడానికి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన స్పందనే నిదర్శనమని తెలిపారు. అలాగే వాస్తవాలను ప్రజలకు వివరిస్తే... ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తారని.. దీనికి కర్నూలులో డీఎస్సీ-2025 టీచర్లు చేపట్టిన కార్యక్రమమే ప్రత్యక్ష ఉదాహరణ అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో నెలవారీ ఆర్థిక ప్రగతి నివేదికపై సమీక్షించామని అన్నారు. జులైలో 10.70 శాతం వృద్ధిని నమోదు చేయగలిగామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఇప్పటి నుంచి ఎక్కువగా ఉండనుందని చెప్పారు. ఇప్పుడే అసలు సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని.. వీటిని అధిగమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నకిలీ పోలీసులతో ర్యాలీలా? వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'.. భారీ పెట్టుబడులే లక్ష్యం

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

## POB రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించొద్దు

దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి..

దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. భూ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్లన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 14వ తేదీలోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో పెట్టాలని దిశానిర్దేశం చేశారు. ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టేందుకే ఆన్‌లైన్ విధానం అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్ పెడుతున్నామని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల ఆధారంగానే రిజిస్ట్రేషన్లపై నిర్ణయం తీసుకుంటామని చెప్పుకొచ్చారు.

### దరఖాస్తులను నేరుగా కలెక్టర్లకు పంపాలి..

దరఖాస్తులను ఇక తహసీల్దార్లకు కాకుండా నేరుగా కలెక్టర్లకు పంపాలని మంత్రి పొంగులేటి సూచించారు. ాాదీ రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించొద్దని ఆదేశించారు. తిరస్కరణకు కారణాలు తెలిపేందుకు మూడు రోజుల సమయం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదని స్పష్టం చేశారు. అర్హులకు అన్యాయం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్లకు ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గదర్శకాలు జారీ చేశారు.

## ఆగస్టు 15న జెండా పండుగను సగర్వంగా నిర్వహించుకుందాం

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోదీ పేర్కొన్నారు.

## తిరుమలలో భారీ రద్దీ.. శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు



రద్దీ దృష్ట్యా, ఎలాంటి దర్శన టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం లభించడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ యంత్రాంగం నిరంతరాయంగా పాలు, తాగునీరు మరియు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తోంది. నిన్న (ఆగస్టు 10న) ఒక్కరోజే 81,064 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 33,136 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఇక భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.36 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున, దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు భక్తులందరూ యంత్రాంగానికి సహకరించాలని, ఆలయ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

## 158 గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం - నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పవన్ ఆదేశం

### మొదటి పేజీ తరువాయి



158 మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతులిచ్చారు. 347 కిలోమీటర్ల పొడవున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. 13 జిల్లాల్లో రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి, అంచనాలు రూపొందించామన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.422.10 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. రోడ్ల నిర్వహణకు మరో రూ.24.47 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. మారుమూల గ్రామాలకు నిర్మించే రహదారుల నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఏపీకి రెండో ర్యాంకు: మరోవైపు ఇటీవలే గ్రామీణ రహదారుల నిర్మాణంలో ఏపీ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' పనుల్లో గుజరాత్ మొదటి ర్యాంకును కైవసం చేసుకోగా, ఆంధ్రప్రదేశ్ రెండో ర్యాంకు దక్కించుకుంది. రహదారుల నాణ్యత విషయంలో రాష్ట్రం అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర ప్రభుత్వం ప్రశంసల వర్షం కురిపించింది. వైఎస్సార్సీపీ పాలనలో 19వ స్థానంలో ఉన్న ఏపీ ఇప్పుడు ఏకంగా రెండో స్థానానికి ఎగబాకడం విశేషం. ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న ప్రత్యేక చర్యలే కారణం. గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ఆయన మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ రోడ్డు కావాలని ప్రజలు కోరినా, కేవలం గంటల వ్యవధిలోనే ఆ పనులను ఆయన మంజూరు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పర్యవేక్షించేందుకు సమర్థులైన అధికారులను నియమించారు. అంతేకాక పవన్ కల్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను క్షేత్రస్థాయికి వెళ్లి నిశితంగా పరిశీలించారు. ఈ క్రమంలోనే కాంట్రాక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పవన్ కల్యాణ్ కఠిన వైఖరితో రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పెరిగాయి. రాజీ లేని నాణ్యతతో పల్లె ప్రజలకు మంచి రహదారులు అందుబాటులోకి వచ్చాయి.

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట: పాలకొల్లు సభలో జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు నిప్పులు

### మొదటి పేజీ తరువాయి

గొడ్డలి పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండకపోతే భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి ఊపిరి పోస్తూ రూ.1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీకి సంబంధించిన జీవోను మంత్రి విడుదల చేశారు. పాలకొల్లులో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజులతో కలిసి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆక్వారంగం అనేది సీఎం చంద్రబాబు నాయుడి మానసపుత్రిక అని అభివర్ణించిన ఆయన, ఐదు కోట్ల ఆంధ్రులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం వల్లనే చంద్రబాబు వంటి దార్శనిక నేత దక్కారని కొనియాడారు. 2019లో ప్రజలు ఆవేశపడి దోపిడీదారులకు అధికారం కట్టబెట్టడం వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఐదేళ్లపాటు తీవ్ర ఐసీయూ స్థితిలోకి వెళ్లిందని, నాటి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు జగన్ ప్రతి చిన్న విషయాన్నీ సమస్యగా చిత్రీకరించే చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంతటి నిధుల కొరత ఉన్నప్పటికీ ఆక్వా రైతులను ఆదుకోవాలనే ఏకైక సంకల్పంతో ఈ భారీ విద్యుత్ సబ్సిడీని సకాలంలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీతో పాటు, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం ఈ 26 నెలల స్వల్ప వ్యవధిలోనే నెరవేర్చామని గర్వంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ సాయంతో ఏపీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని, రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మారుస్తూ 'బ్లూ ఎకానమీ' దిశగా ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు.



## భారత్‌లో అరుణాచల్ విడదీయలేని భాగం- ఆ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు'

### మొదటి పేజీ తరువాయి

### 'బార్డర్‌లో శాంతి కాపాడడమే ముఖ్యం'



అరుణాచల్ ప్రదేశ్‌లోని అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో చైనా దళాలు చొరబడ్డాయన్న వార్తలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. సరిహద్దుల్లో పరిస్థితులు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులోని ప్రాంతాల్లో శాంతిని కాపాడటమే అత్యంత ముఖ్యమని తెలిపారు. అలాగే సరిహద్దు సమస్యలపై జరిగిన చర్చల వివరాలను వెల్లడించారు. "అరుణాచల్ ప్రదేశ్ దేశంలో విడదీయరాని అంతర్భాగం అని నేను మరోసారి పునరుద్ఘాటిస్తున్నాను. ఇది స్వయం సిద్ధమైన వాస్తవం. అదే సమయంలో ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు. భారత్-చైనా సరిహద్దులోని సమస్యలు అత్యంత తీవ్రమైనవిగా పరిగణిస్తున్నాం. ఇరు దేశాల బార్డర్‌లోని ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతను కాపాడటం అత్యంత ముఖ్యమని చైనాతో జరిపిన చర్చల్లో భారత్ నొక్కిచెప్పింది. సరిహద్దుల్లో పరిస్థితులు ఇరు దేశాల విస్తృత ద్వైపాక్షిక సంబంధాలను ప్రభావితం చేస్తాయని డ్రాగన్‌కు స్పష్టం చేశాం. ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై బహిరంగ చర్చలు జరిపాయి. ఎల్ఏసీ వెంబడి ఉన్న పరిస్థితిని సమీక్షించాయి. ఎల్ఏసీ వెంబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి, ఊహాగానాలను నివారించడానికి ప్రస్తుతం ఉన్న దౌత్య మార్గాలను కొనసాగించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయి" అని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

### కొన్నేళ్లుగా చైనాది ఇదే తీరు

అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా జాంగ్‌నాన్‌గా పిలుస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టే ప్రక్రియను డ్రాగన్ 2017లోనే మొదలుపెట్టింది. అప్పట్లో చైనా పౌర వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆరు ప్రాంతాలకు ప్రామాణిక పేర్లను పెట్టింది. ఆ తర్వాత 2021లో మరో 15 ప్రాంతాలకు పేర్లను ప్రకటించింది. 2023లో 11 ప్రాంతాలకు పేర్లను పెట్టింది. అయితే మొదటి నుంచి భారత్ ఈ చర్యలను తప్పుపడుతోంది. తాజాగా కూడా అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని స్పష్టం చేసింది.

### పీఓకేలో హింసపై భారత్ ఏమందంటే?

అలాగే పీఓకేలో జరుగుతున్న హింసపైనా రణ్‌ధీర్ జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. "పీఓకేలోని పరిణామాలను నిశితంగా గమనిస్తూనే ఉన్నాం. అదే సమయంలో పాక్‌లో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలను పరిశీలించాం. పాకిస్థాన్ చేసిన దుర్మార్గాలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు ఆ దేశాన్ని జవాబుదారీగా నిలబెట్టాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిస్తున్నాం. " అని రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. మరోవైపు, భారత రాయబారి దినేష్ త్రివేది బంగ్లాదేశ్ ప్రధాని రెహమాన్‌ను కలవడంపైనా జైస్వాల్ స్పందించారు. ద్వైపాక్షిక పర్యటనకు, అలాగే దిల్లీలో జరగనున్న బ్రిక్స్ షెర్పా సెషన్‌కు భారత్ బంగ్లా ప్రధానికి ఆహ్వానం పంపిందని తెలిపారు. ఈ ప్రత్యేక విషయంపై తాము ఎప్పటికప్పుడు మీడియాకు సమాచారం అందిస్తామని అన్నారు. ఇండియాలో అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ సమావేశం కావడంపైనా సమగ్ర వివరణ ఇచ్చారు ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్. "అజిత్ దోభాల్, సెర్గియో గోర్ మధ్య నిన్న(సోమవారం) ఒక సమావేశం జరిగింది. రెండో సమావేశం మంగళవారం జరిగింది. భారత్, అమెరికాల మధ్య ఉన్న సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించడానికి ఈ సమావేశాలు ఒక అవకాశంగా నిలిచాయి. ఈ సమావేశాల్లో వివిధ అంశాలలో పురోగతి లభిస్తుంది. వాణిజ్యం, స్నేహం, ఇంధన భద్రత, కీలకమైన క్షిపణులు, ఇతర రంగాలలో సంబంధాన్ని బలోపేతం చేసుకోవడానికి ఇరుపక్షాలు కట్టుబడి ఉన్నాయి. " అని రణ్‌ధీర్ వెల్లడించారు.

## కరెన్సీపై కేంద్రం కీలక నిర్ణయం- రూ.10, రూ.20 పాలిమర్ నోట్ల ట్రయల్స్ కు గ్రీన్‌సిగ్నల్

### మొదటి పేజీ తరువాయి



ఆ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. పాలిమర్ నోట్లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కేంద్ర బోర్డు సిఫార్సుతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఆర్బీఐ చట్టం-1934లోని సెక్షన్ 25 ప్రకారం ఆ ప్రతిపాదనను కేంద్రానికి సమర్పించింది. రూ.10, రూ.20 విలువలతో ఒక్కో డినామినేషన్‌కు 100 కోట్ల పాలిమర్ నోట్లను ముద్రించి ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహించాలని ప్రతిపాదించింది. ఆ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్‌లో పాలిమర్ నోట్లను సాధారణంగా చలామణిలోకి తీసుకురావాలని ఆర్బీఐ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని ఆర్థిక మంత్రి వెల్లడించారు.

### కాగితపు నోట్లతోపాటు!

అయితే ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో పూర్తిగా పాలిమర్ నోట్లను తీసుకురావడం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలిమర్ నోట్లు ప్రవేశపెట్టినప్పటికీ కాగితపు నోట్లు కూడా చలామణిలో కొనసాగుతాయని తెలిపింది. అంటే కొంతకాలం పాటు రెండు రకాల నోట్లు ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి. అయితే పాలిమర్ నోట్ల కొనుగోలు ప్రక్రియ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని ఆర్బీఐ కేంద్రానికి సమాచారం ఇచ్చింది. దీంతో ఫీల్డ్ ట్రయల్స్ ఎప్పుడు ప్రారంభమవుతాయి? సాధారణ చలామణిలోకి పాలిమర్ నోట్లు ఎప్పుడు వస్తాయి? అనే విషయాలపై ప్రస్తుతం కచ్చితమైన సమయం చెప్పడం సాధ్యం కాదని నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే ఈ ప్రక్రియకు ఎంత ఖర్చవుతుందనే విషయాన్ని కూడా ఇప్పుడే నిర్ధరించలేమని చెప్పారు.

### తగ్గిన ద్రవ్యోల్బణం

మరోవైపు, దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతోందని కేంద్రం వెల్లడించింది. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా నమోదయ్యే సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 2023-24లో 5.4 శాతంగా ఉంది. 2024-25లో ఇది 4.6 శాతానికి తగ్గింది. 2025-26లో మరింత తగ్గి 2.1 శాతానికి చేరిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అయితే 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం కొంత పెరిగింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా వస్తువుల ధరలపై ప్రభావం పడటం, అంతర్జాతీయ ఇంధన ధరలు అధికంగా ఉండటం, కూరగాయల ధరల్లో పెరుగుదల, ఎల్‌నినో పరిస్థితులు వంటి కారణాలతో 2026-27 తొలి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.9 శాతానికి చేరిందని ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ ఇది ఆర్బీఐ నిర్దేశించిన 4 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యానికి దిగువనే ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

### జీఎస్టీ రేట్లలో మార్పులు

ధరల ఒత్తిడిని తగ్గించేందుకు పరోక్ష పన్నుల విధానంలో కూడా ప్రభుత్వం మార్పులు చేపట్టిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రెండు ప్రధాన రేట్లను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇందులో 18 శాతం స్టాండర్డ్ రేటు, 5 శాతం మెరిట్ రేటు ఉండగా, ఎంపిక చేసిన కొన్ని వస్తువులు, సేవలకు 40 శాతం ప్రత్యేక డీమెరిట్ రేటును నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో 28 శాతం జీఎస్టీ ఉన్న అనేక వస్తువులను 18 శాతానికి తగ్గించారు. అలాగే 18 శాతం ఉన్న కొన్ని వస్తువులపై పన్నును 12 లేదా 5 శాతానికి తగ్గించారు. 12 శాతం ఉన్న మరికొన్ని వస్తువులపై పన్నును 5 శాతం లేదా సున్నాకు తగ్గించినట్లు కేంద్రం వెల్లడించింది.

### దిగుమతి సుంకాల్లో మార్పులు

దేశీయ తయారీని ప్రోత్సహించడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఎగుమతుల పోటీ తత్వాన్ని పెంచడం, వ్యూహాత్మక రంగాలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పలు వస్తువులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ని కూడా ప్రభుత్వం సవరించింది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఆ మార్పులు ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. అత్యవసర వస్తువుల ధరలపై ఒత్తిడిని తగ్గించేందుకు క్రూడ్ పామ్ ఆయిల్, క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని తగ్గించారు. మసూర్ పప్పుపై అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను తగ్గించారు. అలాగే 2026 మార్చిలో పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.10 చొప్పున తగ్గించినట్లు ప్రభుత్వం తెలిపింది.

## 'మేము యువతకు అండగా ఉంటాం'

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మరే ఇతర అధికారులు గానీ వారి చర్యల పర్యవసానాల నుంచి తప్పించుకోలేరని అన్నారు. ఓ జాతీయ వార్తాపత్రికకు రాసిన వ్యాసంలో రాహుల్ గాంధీ ఈ మేరకు మోదీ సర్కార్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "జులై 20న దేశవ్యాప్తంగా వేలాది మంది యువత తాము ఎన్నుకున్న నాయకుడి నుంచి జవాబుదారీతనాన్ని ఆశించారు. కాస్త ఆలస్యమైనా యువతకు ఆ జవాబుదారీతనం లభిస్తుంది. జులై 20న దేశ యువత విద్యా వ్యవస్థ, పేపర్ లీక్‌లపై జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ ఏకమయ్యారు. అన్ని కులాలు, వర్గాలు, ప్రాంతాలు, మతాలకు చెందిన విద్యార్థులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. న్యాయం కోసం డిమాండ్ చేసేంత ధైర్యం, తమ రాజ్యాంగ హక్కులను తెలుసుకునేంత వివేకం, పోరాడి గెలవగలమని నమ్మేంత నిబద్ధత విద్యార్థులకు ఉన్నాయి. నిరసనకారులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, నవ్వుతూ, చేతులు పట్టుకుని ఐక్యంగా నిలబడడాన్ని యావత్ దేశం ఆశ్చర్యంతో చూసింది. ఈ నిరసనలు భారతదేశపు గర్వించదగిన శాంతియుత ప్రతిఘటన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాయి. ఈ సంప్రదాయమే దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టింది. "

రాహుల్ గాంధీ, లోక్‌సభలో విపక్ష నేత

యువత గొంతును అణిచివేసే ప్రయత్నం : రాహుల్

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత గొంతును అణిచివేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నించిందని రాహుల్ ఆరోపించారు. స్టూడెంట్స్‌పై పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌తో దాడి చేశారని మండిపడ్డారు. మేకులు దింపిన లాఠీలతో కొట్టారని, పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారని భగ్గుమన్నారు. లాఠీలతో యువతులపై దారుణంగా దాడి చేశారని విమర్శించారు. మైనర్లను లాఠీలతో కొట్టడంతో వారి ఎముకలు విరిగాయని తెలిపారు. అలాగే ఇంకొందరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. బిహార్‌లోని సివాన్‌లో నిరసన చేపట్టిన విద్యార్థులపై ఏకే-47తో సహా పలు తుపాకులతో కాల్పులు జరపడంతో చాలా మంది తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించారు. ఈ చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన హింసకు అధికారం ఎవరు ఇచ్చారు? అని ప్రశ్నించారు.

తమ భావ ప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకున్న భారత యువతను క్షమిస్తున్నట్లు ప్రధాని మోదీ స్వయంగా ఒక వీడియో చేశారని రాహుల్ పేర్కొన్నారు. జవాబుదారీతనం కోరుతున్న తన సొంత ప్రజలనే ఒక ప్రధాని క్షమించడమేంటని ప్రశ్నించారు. విపక్షంలో ఉన్న తాము యువతతో నిలబడతామని చెప్పారు. "నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ కేంద్రీకృత నియంత్రణ గురించి గొప్పగా చెప్పుకుంటుంది. అది అంగారక గ్రహ యాత్ర అయినా లేదా ఒలింపిక్ పతకం అయినా దాని ఘనత ప్రధాని మోదీ, అమిత్ షాలకే దక్కుతుందని పదేపదే వల్లె వేస్తుంది. మోదీ, షా ఆమోదం లేకుండా ఏదీ ముందుకు సాగదు. విద్యార్థులపై దాడి దిల్లీ నగరం నడిబొడ్డున జరిగింది. పార్లమెంట్‌కు కేవలం 500 మీటర్ల దూరంలో జరిగింది. అక్కడ మోహరించిన భద్రతా దళాలు, దిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ నేరుగా హోం మంత్రికి ఏదైనా విషయాన్ని నివేదిస్తాయి. విద్యార్థులపై దాడికి అమిత్ షా అధికారం ఇచ్చారు. విద్యార్థులపై దాడికి ఆయనే బాధ్యుడు. అందుకే షా తన పదవికి రాజీనామా చేయాలి. విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్‌పై షా ఎలాంటి విచారణకు ఆదేశించలేదు. కనీసం ఒక ప్రకటన కూడా విడుదల చేయలేదు. పార్లమెంట్‌కు రావడానికి నిరాకరించారు. ఈ అంశంపై చర్చ కోరుతూ ప్రతిపక్షాలు రోజూ ప్రవేశపెడుతున్న తీర్మానాలను ఏకపక్షంగా తిరస్కరిస్తున్నారు. అదే సమయంలో తన ప్రతిష్ఠను కాపాడుకోవాలనే ఆత్రుతతో ప్రధాని మోదీ తన ప్రచార యంత్రాంగాన్ని, గోదీ మీడియాను క్రియాశీలకం చేశారు. యువ నిరసనకారులను భయపెట్టేందుకు వారిపై ఎఫ్ఐఆర్‌లు, అరెస్టులు కొనసాగుతున్నాయి. " అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

యువత గొంతుకను రాహుల్ వినిపించారు : ఖర్గే, జైరాం రమేశ్

మరోవైపు, రాహుల్ గాంధీ రాసిన వ్యాసం స్క్రీన్ షాట్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాహుల్ యువత గొంతుకను వినిపించారని ఖర్గే అన్నారు. కేవలం కబుర్లు, ఆర్భాటాలు,

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

బుధవారం12-08-2026

## తుని ప్రాంతీయ ఆసుపత్రికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు వాహనాలను ప్రారంభించిన సీనియర్ నేత యనమల రాజేష్



**తుని, ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తుని ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వ విప్ యనమల దివ్య కృషి చేస్తున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.ఇందులో భాగంగా ఆసుపత్రికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను రప్పించారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీనియర్ నేత యనమల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, మల్ల గణేష్, కుసుమంచి శోభారాణి, తటవర్తి రాజా, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## ఆలయ అర్చకులకు ఆర్థిక భరోసా దిశగా అడుగులు



**అనంతసాగరం ఆగస్టు 11 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** ఆలయ అర్చకుల సమస్యలు సంక్షేమ అంశాలపై చర్చించేందుకు శ్రీ కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో అనంతసాగరం కలువాయి మండలాల అర్చకుల సమావేశం సోమశిలలో నిర్వహించారు.అర్చకులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అర్చకుల సంక్షేమానికి చేస్తున్న కృషిని అర్చకులు అభినందించారు. అనంతసాగరం మండల అర్చకుల అధ్యక్షులు అన్నవరపు రామకృష్ణశర్మ, కలువాయి మండల అర్చకుల అధ్యక్షులు రామయ్య సంపత్‌చార్యులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రెండు మండలాల్లోని 23 మంది అర్చకుల వేతనాలను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఆలయాల అభివృద్ధితో పాటు అర్చకుల సంక్షేమానికి మంత్రి ఆనం ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని త్వరలో కలిసి ఘనంగా సత్కరించి, అర్చకుల తరపున కృతజ్ఞతలు తెలియజేయనున్నట్లు అర్చకుల ప్రతినిధులు తెలిపారు.అర్చకులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమావేశం నిర్వహించిన ఉప్పల విజయ్‌కుమార్ చొరవను కూడా వారు అభినందించారు.

## పాయకరావుపేటలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

### 88 గ్రాముల బంగారు ఆభరణాలు, యాక్టివా అపహరణ.. కేసు నమోదు చేసి దర్యాప్తు



**పాయకరావుపేట, ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్వర్క్:** పాయకరావుపేట గ్రామంలోని రాజుగారి బీడుకు చెందిన రామ్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన విజయవాడకు వెళ్లి, ఆగస్టు 10న తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి మెయిన్ గేట్‌తో పాటు లోపలి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. బెడ్‌రూమ్‌లోని బీరువా తాళాలు పగులగొట్టి ఉండటంతో పరిశీలించగా, బీరువాలోని అరలో భద్రపరిచిన సుమారు 88 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు.అలాగే ఇంటి వరండాలో పార్క్ చేసిన ఏపీ 16 ఈసీ 6878 నంబరు గల ఓల్డ్ యాక్టివా వాహనం కూడా అపహరణకు గురైనట్లు గుర్తించారు.గుర్తుతెలియని వ్యక్తులు ఆగస్టు 9వ తేదీ రాత్రి ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాన్ని అపహరించినట్లు రామ్మోహన్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాయకరావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదు చేశారు.క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి.ఇంటి తాళాలు వేసి స్వగ్రామం లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తాము ఏ తేదీ నుంచి ఏ తేదీ వరకు అందుబాటులో ఉండరో పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూచించారు. అలా సమాచారం అందిస్తే రాత్రి వేళల్లో బీట్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఇంటి తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకూడదని సూచించారు. పగలు లేదా రాత్రి వేళల్లో పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:సీఐ, పాయకరావుపేట: 9440796106,ఎస్ఐ, పాయకరావుపేట: 9347633643.ఇంటి దొంగతనాలు, బయట పార్క్ చేసిన వాహనాల చోరీలను నివారించేందుకు పాయకరావుపేట గ్రామం నలుదిశల్లో ప్రతిరోజూ రాత్రివేళ వాహనాల తనిఖీలు నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు.వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ చూపించాలని సూచించారు. రాత్రివేళ ప్రయాణానికి సరైన కారణాన్ని కూడా తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.సరైన పత్రాలు లేని వాహనాలను పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి, మరుసటి రోజు ఉదయం సంబంధిత రికార్డులు చూపించిన అనంతరం వాహనదారులకు అప్పగిస్తామని తెలిపారు.అదేవిధంగా దొంగతనాల నివారణకు పాయకరావుపేట గ్రామంలోని ప్రతి వీధిలో, దుకాణాల వద్ద బయటివైపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రజలకు సూచించారు.

## మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామలింగం యాదవ్‌కు ఘన నివాళి



**నాగార్జునసాగర్ ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామలింగం యాదవ్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామలింగం యాదవ్ మృతి తీవ్రంగా బాధాకరమని, ఆయన మరణం నియోజకవర్గానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని ఫోర్టిస్ గ్లెనీగల్స్ ఆసుపత్రిలో ఉంచిన రామలింగం యాదవ్ పార్థివదేహాన్ని మాజీ సీఎల్పీ నేత, మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి దర్పల్లి రాజశేఖర్ రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామలింగం యాదవ్‌తో తమకున్న అనుబంధాన్ని, ఆయన ప్రజా జీవితంలో అందించిన సేవలను వారు స్మరించుకున్నారు. నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో రైతులు, వ్యాపారులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని నాయకులు గుర్తుచేశారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ అందరితో మంచి సంబంధాలు కొనసాగించిన వ్యక్తిగా రామలింగం యాదవ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు సన్నిహితులు, అనుచరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. ఈ విషాద సమయంలో రామలింగం యాదవ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. రామలింగం యాదవ్ మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీకి సంబంధించిన ప్రతినిధులు, స్థానిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన చేసిన సేవలను ఎప్పటికీ మరచిపోలేమని పేర్కొన్నారు.

## తునిలో రైతు శ్రేయస్సు కోసం నాలుగు రోజుల వరుణ యాగం

### 19 నుంచి 22 వరకు తేటగుంట యనమల గార్డెన్స్‌లో వేదమంత్రోచ్చారణలతో యాగం



**తుని, ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్వర్క్:** దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ యనమల దివ్య ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించేందుకు సంకల్పించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వర్షాభావ పరిస్థితుల నుంచి ప్రజలు, రైతులు గట్టెక్కాలని వారు ఆకాంక్షించారు. తుని నియోజకవర్గం పసిడి పంటలతో కళకళలాడాలని, దేశవ్యాప్తంగా దుర్భిక్ష పరిస్థితులు లేకుండా సుభిక్షంగా ఉండాలని కోరుతూ తుని మండలం తేటగుంటలోని యనమల గార్డెన్స్‌లో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. రాజకీయాలకు అతీతంగా రైతు కుటుంబాలు, రైతు ప్రతినిధుల భాగస్వామ్యంతో వరుణ కటాక్షం కోసం శాస్త్రోక్తంగా యజ్ఞయాగాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఋత్వికుల వేదమంత్రోచ్చారణల మధ్య వరుణ యాగం కొనసాగనుంది. రైతులు, రైతు ప్రతినిధులు, దంపతుల సారథ్యంలో హోమాలు నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ మహాయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వరుణ యాగం ఏర్పాట్ల బాధ్యతలను యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి సత్యనారాయణ, యనమల లక్ష్మణరావు, మల్ల గణేష్, గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యనారాయణ, చొక్కా అప్పారావు, నేమాల అప్పారావు, కుర్రా వెంకట రమణ, దంతులూరి శ్రీనివాసరాజుకు అప్పగించారు. వేదపండితులతో కలిసి వారు యాగం నిర్వహించనున్న ప్రదేశాన్ని పరిశీలించి, యాగశాలల నిర్మాణానికి అవసరమైన కొలతలు, భూమి చదును పనులను పర్యవేక్షించారు. ఇప్పటికే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలిచిన యనమల గార్డెన్స్‌లో మరోసారి వరుణ యాగం నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## చాపల కాలనీలో పోలీసుల విస్తృత తనిఖీలు



**అనంతసాగరం ఆగస్టు 11 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని చాపల కాలనీలో నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించారు ఈ సందర్భంగా పోలీసులు కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు సూచనలు చేశారు.అనంతరం సీఐ గంగాధర్ కాలనీ ప్రజలతో మాట్లాడి చట్టాలపై అవగాహన కల్పించారు గుర్తుతెలియని వ్యక్తులు కాలనీలో సంచరిస్తే వారి కదలికలపై అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు ప్రజల భద్రతకు పోలీసులకు సహకరించాలని కోరారు.అనంతరం కాలనీలో 29 వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి సోమశిల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు.కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు ఎస్సై పి. అనూష అనంతసాగరం ఎస్సై రాజేష్ ఆత్మకూరు ఎస్సై జంపాని, ఏఎస్సైలు కానిస్టేబుళ్లు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చేజర్ల సొసైటీలో తాత్కాలిక ఉద్యోగాల పేరుతో సొసైటీ నిధులకు చిల్లు




**నెల్లూరు జిల్లా చేజర్ల మండలం ఆగస్టు 11 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** చేజర్ల మండల సొసైటీ కేంద్రంలో తాత్కాలిక ఉద్యోగస్తులు పేరుతో భారీ అవినీతి జరిగినట్లు కొంతమంది స్థానికుల నుండి వస్తున్న సమాచారం.గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు కొంతమందిని తాత్కాలికంగా ఉద్యోగాలలో నియమించు కోవడం జరిగినది.అయితే చేజర్ల సొసైటీలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగస్తుల నియామకాలు పక్కన పెడితే తాత్కాలికంగా కొంతమందిని నియమించుకోవడం సొసైటీ తీర్మానాలకు నిబంధనలకు వ్యతిరేకంగా జరిగినట్లు సమాచారం.గతంలో 2017లో ఏప్రిల్ 1వ తేదీన ఒక వ్యక్తిని జాయిన్ చేసుకున్నట్లు అప్పటి అధికారులు రికార్డులలో నమోదు చేసుకున్నారని ప్రస్తుతం సీఈఓ గా పనిచేస్తున్న అధికారి తెలిపారు.కానీ జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ వారి నియమ నిబంధనలను పాటించకుండా ఎలా చేసుకుంటారని కొందరి నుంచి వస్తున్న అభిప్రాయం. అసలు 2019 తర్వాత ఎవరిని కూడా సొసైటీలో తాత్కాలిక ఉద్యోగాలు పేరుతో కొనసాగించకూడదని జీవో ఇచ్చి ఉంది కానీ దానికి వ్యతిరేకంగా 2017లో ఓ వ్యక్తిని ఉద్యోగంలో నియమించుకొని అప్పటినుండి కొనసాగుతున్నట్లు తెలుపుతూ 2020 ఆగస్టులో ఆ వ్యక్తి మొదటి జీతం తీసుకోవడం విడ్డూరంగా ఉంది.2017 లో జాయిన్ అయిన వ్యక్తి 2020లో మొదటి జీతం తీసుకోవడం పట్ల సొసైటీలో భారీ అవినీతి జరుగుతుందని అర్థమవుతున్నట్లు తెలుస్తుంది.ఇదంతా చూస్తే అక్కడ జరిగింది వేరు జరుగుతుంది వేరు ప్రస్తుతం ఉద్యోగాల నియామకాలు చేపట్టే పనే లేదంటూ కొందరి నుండి వస్తున్న సమాచారం.2019 తర్వాత ఎవరిని కూడా తాత్కాలిక విధులలో ఉంచకూడదని అట్టి నిబంధనలకు ఎవరైనా పాల్పడి తాత్కాలికంగా ఉద్యోగాలను నియమిస్తూ వారిని పనిలో పెట్టుకున్నట్లయితే కచ్చితంగా వారికి చర్యలు తప్పవని ఆ జీవో లో పేర్కొనడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ కొంతమంది ఉద్యోగాలు చేస్తూ చేజర్ల సహకార సంఘం నుండి జీతం తీసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.జిల్లా కోపరేటివ్ సొసైటీ వారు దీని మీద విచారణ చేసి రెగ్యులర్ ఉద్యోగులు ఎవరు తాత్కాలికంగా ఎవరు విధులు నిర్వహిస్తున్నారు వంటి వాటిని పరిశీలించి సొసైటీ నిధులు తప్పుదోవ పట్టకుండా దీనికి బాధ్యత ఎవరు వహిస్తున్నారు పరిశీలన చేసి తక్షణమే వారి మీద చర్యలు తీసుకోవాలని మండల స్థానికుల నుండి వస్తున్న అభిప్రాయం.చేజర్ల సొసైటీ సీఈఓ వివరణ చేజర్ల సొసైటీలో మొత్తం నలుగురు ఉద్యోగస్తులు ఉన్నారు అందులో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగస్తులు మరో ఇద్దరు తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు.రెగ్యులర్ ఉద్యోగస్తులుగా వెంకటరమణ మరియు కే దొరసాన్ రెడ్డి తాత్కాలికంగా నజీర్ ఎస్ వి సుబ్రహ్మణ్యం కంప్యూటర్ ఆపరేటర్ గా ఫరిదా అనే వ్యక్తులు ఈ సొసైటీలో పనిచేస్తున్నారని తెలిపారు. ఓ వ్యక్తికి సంబంధించి సీఈఓ ని వివరణ అడగగా ప్రస్తుతం నేను వచ్చి ఎక్కువ కాలం కాలేదు రికార్డులలో ఉన్నది మాత్రమే నేను చెబుతున్నాను 2017 ఏప్రిల్ 1వ తేదీ నుండి కె. దొరసాన్ రెడ్డి ఉద్యోగిగా చేజర్ల సొసైటీలో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

## 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** మద్దిరాల మండలంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సంఘ సభ్యత్వ నమోదు, సభ్యత్వ కార్డుల అందజేతతో పాటు ఉపాధ్యాయుల సమస్యల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న నెమిల, ప్రాథమిక పాఠశాల చిన్న నెమిల, మామిళ్లమాడవ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముకుందాపురం, ప్రాథమిక పాఠశాల ముకుందాపురం, హరిజన కాలనీ ముకుందాపురం, ప్రాథమికోన్నత పాఠశాల చందుపట్ల పాఠశాలలను సందర్శించిన టీపీటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులను కలిసి సంఘ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ రిపోర్టును వెంటనే తెప్పించుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను ఎలాంటి ఆలస్యం లేకుండా విడుదల చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్‌లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించి విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, డీఏలు, బిల్లులు సకాలంలో విడుదల చేయడంతో పాటు పీఆర్సీ అమలులో జాప్యం లేకుండా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీపీటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని, ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కోసం సంఘం ముందుండి పనిచేస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంపల సాల్మన్, ప్రధాన కార్యదర్శి గంగాధర సురేష్ కుమార్, వెంకట కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, సరిత, శిరీష, జోష్న, ముజీబు, శ్రీనివాస్, సలాం ఖాన్, రవీందర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్‌లో మద్యం మత్తులో డ్రైవింగ్‌కు చెక్



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రూరల్ ఎస్సై హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, వాహనాల రాకపోకలు అధికంగా ఉండే మార్గాల్లో పోలీసులు అప్రమత్తంగా తనిఖీలు చేపట్టి వాహనదారులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో పలు వాహనాలను ఆపి వాహనాల నంబర్ ప్లేట్లు, సంబంధిత పత్రాలు, డ్రైవింగ్ విధానం తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించడంతో పాటు నంబర్ ప్లేట్ లేని వాహనాలు, నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేయని వాహనాలు, వాహన పత్రాలు సక్రమంగా లేని వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కేవలం వాహనదారుడి ప్రాణానికే కాకుండా రోడ్డుపై ప్రయాణించే ఇతర వాహనదారులు, పాదచారులు, కుటుంబ సభ్యుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపే కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు. అదే విధంగా నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్‌ను స్పష్టంగా కనిపించకుండా మార్చడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తారని తెలిపారు. వాహనదారులు తమ వాహనాలకు నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, డ్రైవింగ్ సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని, వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచించారు. రహదారిపై ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాలను నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, అతివేగంగా వెళ్లడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలకు కూడా దూరంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా రాత్రి సమయంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే విధంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం ప్రధాన లక్ష్యంగా పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వాహనదారులు పోలీసుల తనిఖీలను భయంగా కాకుండా ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలుగా భావించి సహకరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని పోలీసులు కోరారు. మద్యం సేవించి వాహనం నడపకుండా, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు ఉపయోగించకుండా, అన్ని నిబంధనలు పాటిస్తూ ప్రయాణిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు తెలిపారు.

## మహోత్సవంలో భాగంగా త్రిపురారంలో మొక్కలు నాటిన అధికారులు

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



**త్రిపురారం మండల ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** త్రిపురారం మండల పరిధిలోని వైకుంఠధామంలో మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శేఖర్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న హరిత కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి అది పెద్ద చెట్టుగా ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. వైకుంఠధామాల పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఇందిరాచౌక్ వరకు ఎస్ఐ నరేష్ పాదయాత్ర తనిఖీలు

### ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలకు డిమాండ్

**సూర్యాపేట జిల్లా ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ –జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఇందిరాచౌక్ వరకు ప్రధాన రహదారిపై పెరుగుతున్న రద్దీ, చిరు వ్యాపారులు రోడ్లపైకి విస్తరిస్తూ వ్యాపారాలు నిర్వహించడం, వాహనాల అడ్డగోలు పార్కింగ్‌తో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్ స్వయంగా రోడ్డుపై నడిచి పరిస్థితిని పరిశీలిస్తూ రహదారిపై ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చిరు వ్యాపారులు, పండ్ల బండ్లు, చిన్నపాటి వ్యాపార వాహనాలు నిర్ణీత పరిమితిలోనే నిలిపి వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, రహదారిని పూర్తిగా ఆక్రమించే విధంగా బండ్లు, సరుకులు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణంలో ప్రధాన రహదారిపై నడిచే వాహనాలకు, పాదచారులకు తగినంత స్థలం ఉండేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, చిన్న వయసు పిల్లలు వాహనాలు నడుపుతూ రోడ్లపై వేగంగా దూసుకెళ్తున్న ఘటనలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నిబంధనలను కఠినంగా అమలు చేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, మైనర్లు వాహనాలు నడపడం, అధిక వేగంతో వాహనాలు నడపడం, రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. అలాగే వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేయడం, అధిక శబ్దం చేసే సైలెన్సర్లను ఉపయోగించడం వంటి వాటిపైనా ప్రత్యేక దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారిపై పోలీసులు తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడితే పట్టణంలో రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రమాదాల నివారణకు కూడా అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని హుజూర్‌నగర్ పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, రహదారి ఆక్రమణలు, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, అడ్డగోలు పార్కింగ్, అధిక వేగం, నిబంధనలకు విరుద్ధమైన సైలెన్సర్ల వినియోగంపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల చేయూత



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన 11వ వార్డు నివాసి దారెల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి అండగా నిలిచారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కస్తాల సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కస్తాల దిల్, హుజూర్‌నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గెల్లి రవి ద్వారా మృతుడి కుటుంబానికి పెద్దకర్మ కార్యక్రమం నిర్వహణ కోసం 50 కిలోల బియ్యాన్ని సహాయంగా అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావించి ఈ సహాయాన్ని అందించినట్లు నాయకులు తెలిపారు. కుటుంబ సభ్యులకు అవసరమైన సమయంలో సహాయం అందించడం ద్వారా వారికి కొంతమేర ధైర్యం కల్పించేందుకు ప్రయత్నించామని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో సహాయం అందించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు తమ వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తాల నరేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలతో కుంచించుకుపోయిన భూమి ఛానల్ కాల్వ

### సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు.. సర్వేతో ఆక్రమణల తొలగింపునకు అధికారుల చర్యలు



**పాయకరావుపేట,ఆగస్టు 11 ప్రజా న్యూస్ నెట్వర్క్:** రైతుల పంట పొలాలకు సాగునీరు అందించడంలో కీలకమైన భూమి ఛానల్ కాల్వ ఆక్రమణలతో కుంచించుకుపోయింది. కాల్వలో భారీగా పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం మందగించి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూడికతీత పనుల కోసం ప్రభుత్వం రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ, కాల్వకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు పనులకు ఆటంకంగా మారినట్లు తెలుస్తోంది.తాండవ షుగర్ ఫ్యాక్టరీ సెంటర్ నుంచి శ్రీ ప్రకాష్ కాలేజీ వరకు పలు ప్రాంతాల్లో కాల్వ గట్లు ఆక్రమణలకు గురైనట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో కాల్వలోని పూడికను తొలగించిన తర్వాత వెలికితీసిన మట్టిని వేసేందుకు కూడా తగినంత స్థలం లేకుండా పోయిందని తెలిపారు.కాల్వ వెడల్పు తగ్గిపోవడం వల్ల నీటి ప్రవాహం సక్రమంగా సాగడం లేదని, ఫలితంగా పంట పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గెడ్డం బుజ్జి పత్రికా కథనాల ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు స్పందించినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రైతులకు అత్యవసరంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.కాల్వను పూర్తిస్థాయిలో సర్వే చేసి, ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం.కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ తదితర అధికారులు రైతుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. కాల్వకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం సర్వే చేపట్టి ఆక్రమణలను గుర్తించనున్నట్లు అధికారులు తెలిపారు.ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి, రికార్డుల ఆధారంగా వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహసిల్దార్ ఉమామహేశ్వరరావు, ఇరిగేషన్ జేఈ రాజేష్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సాతూరి చంద్రమౌళి ఉపాధ్యక్షుడు ఉదయచందర్





**ఎల్కతుర్తి, ఆగస్టు 11,ప్రజా న్యూస్ నెట్వర్క్ :** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎల్కతుర్తి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సాతూరి చంద్రమౌళి కోరారు మండలంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఎల్కతుర్తి మండల కేంద్రంలో ప్రత్యేకంగా ప్రెస్ భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ కళాశాల ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జర్నలిస్టుల సమస్యలపై ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రెస్ భవనం లేకపోవడంతో జర్నలిస్టులు సమావేశాలు పత్రికా సమావేశాలు ఇతర మీడియా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు జర్నలిస్టుల కోసం ప్రత్యేక ప్రెస్ భవనం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు మండలంలోని వివిధ పత్రికలు మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు స్థిరమైన ఆదాయం ఉపాధి భద్రత లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు అక్రిడిటేషన్ ప్రాతిపదికన కాకుండా గుర్తింపు కార్డులు కలిగి విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని వారి పిల్లలకు విద్యలో రాయితీలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఎల్కతుర్తిలో ప్రెస్ భవనం మంజూరు చేస్తే మీడియా కార్యకలాపాలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సాతూరి చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఉదయ్ చందర్ బొంకూరి వంశీ నల్ల రాజిరెడ్డి అద్దూరి అనిల్ అంబాల ప్రవీణ్ రామోజు సతీష్ తదితరులు పాల్గొన్నారు



# చరిత్ర పొరల్లో దాగిన త్యాగధనుడు ఖుదీరాం

## స్వాతంత్ర్య సమరంలో తొలి బాంబు పేల్చిన ధీరుడు

### నేడు ఖుదీరాం బోస్ వర్ధంతి

భారత స్వాతంత్ర్య పోరాటం ఒకనాటిది, ఒక యేటిది, ఒక దశాబ్దపుది, శతాబ్దపుది కాదు. అంతకన్నా ఎక్కువ సమయం కొనసాగిన నేపథ్యం ఉంది. అనేక సాయుధ పోరాటాలు, అహింసా యుత పద్ధతిలో జరిగిన ఉద్యమాలు భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగాలు. స్వాతంత్ర్య సమర యోధులు ఉద్యమాలు అనగానే 1857 విప్లవం మరిచిపోని మంగల్ పాండే, తాత్యా తోపే, బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన నిర్భయమైన రాణి లక్ష్మీబాయి, కిట్టూరుకు చెందిన రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, చంద్ర శేఖర్ ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్‌గురు, గురు రామ్ సింగ్, పాల్ రామసామి, రాజేంద్ర ప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, వీర్ సావర్కర్ వంటి లెక్కలేనన్ని మంది నాయకులు, గొప్ప వ్యక్తిత్వాలన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గ దర్శకులు. అలా దేశమాత దాస్య విముక్తి గావించడం కోసం ఎందరో వీరాధివీరులు, మహనీయులు తమ ప్రాణాలొడ్డి జీవితాలను అర్పించారు. అందులో చక్రవర్తులు, సాయుధ వీరులు, యువకులు... ఎందరో దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే త్యాగం చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్క పొడుచు కునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛా భారతావని కోసం అశువులు బాసిన ఎంతో మంది త్యాగధనుల చరిత్ర ఇప్పటి తరాల యువతకు ఎంతో ఉద్వేగ భరితంగా, మరెంతో ఉద్విగ్నంగా పరిణ మిస్తుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పోరాట పటిమను, తెగువను, త్యాగాన్ని చూపించారు. ఎందరో తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. ఈ అసంఖ్యాక స్వాతంత్ర్యోద్యమాల కాలంలో ఎందరో అమరవీరులు ఉన్నారు. ఇందులో చరిత్ర చాలామందిని గ్రంథస్థం చేయలేక పోయింది. చేసినా కొందరిని చరిత్ర మరుగున పడేసింది. అలా చరిత్ర పొరల మాటున ఉన్న వారిలో యువ కిషోరం ఖుదీరాం ముఖ్యుడు. 18ఏళ్ల నూనూగు మీసాల యువ ఖుదీరాం బోస్ దేశం గర్వించదగ్గ త్యాగాన్ని మరిచినా, యాదృచ్ఛికంగా విస్మరించినా, దేశ స్వాతంత్ర్య చరిత్ర పరిపూర్ణం కానట్టే. ఖుదీరాం బోస్ భారతీయ స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతిపిన్న వయస్కుడు. భారత దేశ వాసులను వేధించిన బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం. ఆ కారణంగా అతనిని ఉరితీసే నాటికి అతని వయసు కేవలం 18 సంవత్సరాల 7 నెలల 11 రోజులు మాత్రమే. ఖుదీరాం పశ్చిమ బెంగాల్, మిద్నాపూర్ జిల్లా హబిబ్‌పూర్‌లో 1889 డిసెంబర్ 3న జన్మించాడు. చిన్ననాటి నుంచి స్వాతంత్ర్య కాంక్షతో రగిలి పోయేవాడు. మొదట్లో అభ్రా అనే విప్లవ సంస్థలో చేరాడు. తన నాయకత్వ లక్షణాలు, సాహసో పేతమైన స్ఫూర్తితో ఆ సంస్థలో అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆయన టీచర్ సత్యేంపూదనాథ్ బోస్, భగవద్గీతలను స్ఫూర్తిగా తీసుకున్నాడు. 1905లో బెంగాల్ విభజన అతడిలో బ్రిటిష్ ప్రభుత్వంపై మరింత కసి రేపింది. 16 ఏళ్ల వయసులోనే ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లను బాంబులతో పేల్చి వేశాడు. 1907 ఆగస్టు 26న ఒక కేసు విచారణ సందర్భంగా ఎంతోమంది యువకులు కోర్టు ముందర ఆసక్తిగా గుమికూడి ఉన్నారు. పరిస్థితి శాంతి యుతంగా ఉన్నప్పటికీ ఉన్నట్లుండి పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ వ్యవహారాన్ని అక్కడే ఉండి చూస్తున్న సుశీల్ కుమార్ సేన్ అనే 15 ఏళ్ళ యువకుడు భరించలేక ఆవేశంతో ఒక ఇంగ్లీష్ అధికారి ముక్కుమీద ఒక్కగుద్దు గుద్దాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసు విచారణ చేసిన జడ్జి కింగ్స్ ఫోర్డ్ అనే అధికారి చిన్నవాడన్న దయ లేకుండా సుశీల్ కుమార్ కు15 కొరడా దెబ్బలను శిక్ష విధించాడు. సాహస వంతుడైన ఆ యువకుడు ప్రతి కొరడా దెబ్బకు వందేమాతరం అని నినదించాడు ఈ సంఘటన తరువాత స్వతంత్ర వీరులంతా కింగ్స్ ఫోర్డ్ కు గుణపాఠం చెప్పాలని నిర్ణయించు కున్నారు. మానవ రూపంలో ఉన్న మృగమైన ఫోర్డ్ లాంటి వారు ఉన్నంతవరకు దేశభక్త వీరులకు కష్టాలేనని భావించి అతనిని చంపడానికి నిశ్చయించు కున్నారు. 1908 ఏప్రిల్ మొదటి వారంలో జుగాంతర్ అనే విప్లవ సంస్థకి చెందిన విప్లవ వీరులు కొందరు కలకత్తలో ఒక ఇంటిలో రహస్యంగా సమావేశమై కింగ్స్ ఫోర్ట్ ను అంతం చెయ్యడానికి ఒక ప్రణాళిక రూపొందించి, అమలు చేయ సంకల్పించారు. ఆ సమావేశంలో అరవిందఘోష్ కూడా ఉన్నారు. ఖుదీరాం బోసునూ, ప్రఫుల్లచాకి అనే మరో నవ యువకుడినీ ఈ పనికై నియమించారు. 1908 ఏప్రిల్ 30 రాత్రివేళ వీరిద్దరూ ముజఫర్ పూర్ లోని యురోపియన్ క్లబ్ కు ఒకబాంబు, రివాల్వర్ తీసుకొని వెళ్లారు. కింగ్స్ ఫోర్డ్ వాహనం క్లబ్ బయటకు రాగానే దానిపైకి బాంబును విసిరేసి ఇద్దరు పరిగెత్తి వెళ్లి పోయారు. అయితే ఖుదీరాం, ప్రఫుల్లచాకిలు గమనించని విషయం... ఆ వాహనంలో కింగ్స్ ఫోర్డ్ లేక పోవడం.. అతని భార్య, కుమార్తెలు మాత్రమే ఉండడం. వారు బలి కావడం. ఒక రైల్వే స్టేషన్‌లో టీ తాగుతుండగా ఖుదీరాం బోస్‌ను పోలీసులు పట్టుకో గలిగారు. ఖుదీరాంను నిర్బంధించి రెండు నెలల పాటు విచారణ చేశారు. ముజఫర్ పూర్ బాంబు కేసులో ఫోర్డ్ భార్య, కుమార్తెల మరణానికి కారకుడైన ఖుదీరాంకు మరణశిక్ష విధించారు. 1908 ఆగష్టు 11న ఈ శిక్ష అమలు పరచ బడింది. పెదవులపై చిరునవ్వు చెదరకుండా ఖుదీరాం మృత్యువును ఆహ్వానించాడు. దేశం కోసం బలిదానం చేశాడు. బోస్ పట్టుబడిన రైల్వే స్టేషన్‌కు ఖుదీరాం బోస్ పూసా అని ఈ మధ్యే పేరు పెట్టారు. మాతృ భూమికోసం త్యాగం చెయ్యటం అందరికీ దొరికే అదృష్టం కాదు... అది నాకు లభించింది. అందుకు నేనెంతో గర్వ పడుతున్నాను. అయితే నేను అనుకున్నది సాధించలేదు. క్రూరుడైన కింగ్స్ ఫోర్డ్ ను శిక్షించలేక పోయాను. అదే నా బాధ... అంటూ 1908 ఆగష్టు 19 ఉదయం ఒక చేతిలో భగవద్గీత పట్టుకుని, ఉరికంబం దగ్గరికి వెళుతూ, ఉరితాడు బిగించమని, తలారి ఉరితాడు బిగిస్తుండగా 'వందేమాతరం' అని తుదిశ్వాస విడిచి అమరుడైన దేశ భక్తుడు ఖుదీరాం. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న వేళ...అలనాటి వీరుల, త్యాగధనుల జీవిత చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్యాగ మూర్తుల జీవిత కథలు, వారి జీవన పోరాటాలు, నేటి, రాబోయే తరాలకు జీవిత పాఠం నేర్ప గలగాలి. ఆ ప్రయత్నం ప్రతి దేశవాసీ చేయాలి. వారి త్యాగ పరంపరలను తర్వాతి తరానికి బోధిస్తేనే చైతన్యం కలిగి, వారిని నిరంతరం ఉత్తేజ పరచ డానికి గత చరిత్ర సాక్ష్యంగా నిలవాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494